# నగరానికి ఫ్రేమింగ్..



**పట్టణాలు, నగర దృశ్యాలు, భవనాలు, నిర్మాణాల అందాలను.. సృజనాత్మకంగా చిత్రీకరించడమే అర్బన్ – ఆర్కిటెక్చరల్ ఫొటోగ్రఫీ. మీ చేతిలోని మొబైల్‌ఫోన్‌తోనే.. ఎలాంటి ఖరీదైన పరికరాల అవసరం లేకుండానే.. ఆకాశహర్మ్యాలు, వీధులు, ఆధునిక డిజైన్లను అద్భుతంగా ఫొటోలు తీయవచ్చు. అందుకు అనుసరించాల్సిన పద్ధతులు, సృజనాత్మక ఆలోచనలను అవగాహన చేసుకోవాలి. అప్పుడే పట్టణ వాస్తుశిల్ప ఫొటోగ్రఫీ పట్టుబడుతుంది.**

అర్బన్ – ఆర్కిటెక్చర్ ఫొటోలు.. నగర జీవితంపై ప్రత్యేక దృష్టి పెట్టేలా చేస్తాయి. ఆయా ప్రాంతాల సంస్కృతి, అక్కడి నిర్మాణ శైలిని కళ్లకు కడతాయి. ఆయా నగరాల చరిత్రను ఒకే ఫ్రేమ్‌లో వివరిస్తాయి.

## ఆర్కిటెక్చర్ ఫొటోగ్రఫీలో ప్రధాన అంశాలు

- **స్కైలైన్ ఫొటోగ్రఫీ :** ఎత్తయిన భవనాలు, నగర దృశ్యాలు ఈ కేటగిరీలోకి వస్తాయి.
- **నమూనాలు :** పునరావృతమయ్యే నిర్మాణాలు, రేఖాగణిత ఆకారాలు.. ఇందులో ఉంటాయి.
- **వీధులు :** ఇండ్లు, సామాన్య ప్రజలే ప్రధాన సబ్జెక్టుగా ఉంటారు.
- **చారిత్రక, ఆధునిక వాస్తుశిల్పం :** పాత – కొత్త నిర్మాణాల మధ్య వ్యత్యాసాలను చూపించడం.

## కెమెరా సెట్టింగ్స్

- **HDR మోడ్ :** స్మార్ట్‌ఫోన్ కెమెరాలో హై కాంట్రాస్ట్ మోడ్‌ను యాక్టివేట్ చేసుకోవాలి. సిటీస్కేప్‌లలో షాడోస్, హైలైట్‌లను బ్యాలెన్స్ చేయడంలో ఈ మోడ్ సహాయపడుతుంది.
- **ఫోకస్ :** సబ్జెక్ట్‌పై ఫోకస్ సరిగ్గా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే.. నిర్మాణాల్లో ఉండే వివరాలు, ముఖ్యంగా టెక్చర్స్, ప్యాటర్న్స్ సవివరంగా వస్తాయి.
- **ఎక్స్‌పోజర్ :** ఫొటోగ్రఫీలో చాలా ముఖ్యమైన అంశం. లైటింగ్‌లో ఏమాత్రం హెచ్చు తగ్గులున్నా.. మన శ్రమ అంతా వృథా అవుతుంది. అందుకే ఎక్స్‌పోజర్‌ని సరిగ్గా చెక్ చేసుకోవడం చాలా ముఖ్యం.
- **గ్రిడ్ లైన్స్ :** రూల్–ఆఫ్–థర్డ్స్‌ను ఉపయోగించి.. భవనాలను ఒకే రేఖపై వచ్చేలా చూసుకోవాలి. అప్పుడే ఫొటోలు అద్భుతంగా వస్తాయి.
- **అల్ట్రా–వైడ్ మోడ్ (అందుబాటులో ఉంటే) :** ఫ్రేమ్‌లో ఎక్కువ స్థలం కనిపించాలంటే.. అల్ట్రా–వైడ్ మోడ్ ఆన్ చేసుకోవాలి. దీనివల్ల ఇరుకైన ప్రదేశాలలోనూ ఎత్తయిన భవనాలను ఫొటోలు తీసుకోవచ్చు.
- **ప్రో టిప్ :** కాంతి తక్కువ ఉండే పరిస్థితుల్లో.. షట్టర్ స్పీడ్, ఐఎస్ఓను మీరే కంట్రోల్ చేయాలి. అందుకోసం మీ ఫోన్‌లో ప్రో మోడ్‌లో ఫొటోలు తీయడానికి ప్రయత్నించండి.

## కంపోజిషన్ టెక్నిక్స్

- **లీడింగ్ లైన్స్ :** వీక్షకుడి దృష్టిని సబ్జెక్టు వైపు నడిపించడానికి.. రోడ్లు, వంతెనలు, భవనాల మూలలను హైలైట్ అయ్యేలా చూసుకోవాలి.
- **రిఫ్లెక్షన్స్ :** నగరాల్లో అద్దాల మేడలు.. అద్భుతమైన ప్రతిబింబాలను సృష్టిస్తాయి. మీ ఫొటోలను మరింత అందంగా మారుస్తాయి.
- **లో–యాంగిల్ :** ఠీవిగా నిలబడే పెద్ద పెద్ద భవనాలు.. మరింత గొప్పగా కనిపించాలంటే 'లో యాంగిల్'ను ట్రై చేయండి. కెమెరాను నేలపై ఉంచి.. భవనం పైకప్పు మీదికి పాయింట్ చేయండి.
- **హై–యాంగిల్ :** ఒక్కోసారి ఎత్తయిన భవనం పైనుంచి చూస్తే.. కింద ఉండే నిర్మాణాలు అద్భుతంగా కనిపిస్తుంటాయి. వాటిని ఫొటో తీయడానికి భవనం పైకప్పు లేదా బాల్కనీ నుంచి విస్తృతమైన నగరాన్ని ఫ్రేమ్‌లో బంధించండి.
- **ఫ్రేమింగ్ :** మీ సబ్జెక్ట్‌ను సహజంగా ఫ్రేమ్ చేయడానికి.. భవనాల ఎదురుగా ఉండే తోరణాలు, తలుపులు, చెట్లను కూడా ఫ్రేమింగ్ చేయండి.

## లైటింగ్ టిప్స్

- **గోల్డెన్ అవర్ (సూర్యోదయం/సూర్యాస్తమయం) :** ఉదయం, సాయంత్రం వేళ సూర్యుడి నుంచి వచ్చే సాఫ్ట్ లైటింగ్.. భవనాలకు సరికొత్త కాంతిని ఇస్తుంది.
- **బ్లూ అవర్ (సూర్యాస్తమయం తర్వాత) :** మూడీ, సినిమాటిక్ సిటీస్కేప్‌లకు ఈ సమయం అనువుగా ఉంటుంది.
- **మధ్యాహ్న కాంతి :** పట్టపగలు తీసే ఫొటోల్లో బలమైన నీడలు, కాంట్రాస్ట్ కనిపిస్తుంది. అయితే, ఫొటోలు ఓవర్ ఎక్స్‌పోజ్ కాకుండా చూసుకోవాలి.
- **నైట్ ఫొటోగ్రఫీ :** రాత్రిపూట విద్యుత్ లైట్ల వెలుగుల్లో నగరం సరికొత్తగా కనిపిస్తుంది. మిలుకుమిలుకుమంటూ వెలిగే భవనాలు, వీధిలైట్లను అద్భుతంగా క్యాప్చర్ చేయవచ్చు. ఇందుకోసం స్మార్ట్‌ఫోన్ కెమెరాలో నైట్ మోడ్‌ని ఉపయోగించండి.
- **ప్రో టిప్ :** సాయంత్రం సంధ్యా సమయంలో భవనాల సిల్హౌట్ ఫొటోగ్రఫీని ప్రయత్నించొచ్చు.

## పర్‌ఫెక్ట్ కావాలంటే..

- ఒకే సబ్జెక్ట్.. ఒక్కో సమయంలో ఒక్కోలా కనిపిస్తుంది. మీ సబ్జెక్టు రూపాన్ని వెలుతురు ఎలా మారుస్తుందో చూడటానికి రోజులోని వేర్వేరు సమయాల్లో ఒకే భవనాన్ని క్యాప్చర్ చేయండి.





- అసాధారణ యాంగిల్స్‌ని కనుక్కోండి. ఇందుకు ఫొటోల కోసం ఎంచుకున్న భవనాల నిర్మాణశైలిని లోతుగా పరిశీలించండి. నిర్మాణాల మూలల నుంచి, కొన్నిసార్లు పైకి నుంచి కిందికి, కింది నుంచి పైకి చూస్తూ ఫొటోలు తీయండి. ఎంత ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తే.. అంతమంచి షాట్లు వస్తాయి.
- పర్యావరణాన్ని ప్రేమించండి. నగరాల్లో ఉండే అర్బన్ పార్కులు, రోడ్ డివైడర్ల మధ్యలో ఉండే అందమైన మొక్కలు, చెట్లకు మీ ఫ్రేమ్‌లో చోటివ్వండి.

**చివరిగా..** మీ అర్బన్ – ఆర్కిటెక్చరల్ ఫొటోలను ఎడిట్ చేయడానికి Snapseed , Adobe Lightroom Mobile లేదా VSCO యాప్స్ వాడండి. మీ కెమెరాతో మరిన్ని అద్భుతాలను సృష్టించండి!

...✍ ఆడెపు హరికృష్ణ